ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేశ్, కిశోర్‌గౌడ్ తదితరులు

ఆటో యూనియన్ మహాధర్నాకు ఆటోలో వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్

పస్తులుంచుడేనా.. మార్పు?

మొదటిపేజీ తరువాయి...

జరిగిన మహాధర్నాలో కేటీఆర్ మాట్లాడారు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని, గిరాకీ లేక ఆటోడ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయని విచారం వ్యక్తంచేశారు. ఏడాదికి రూ.12వేలు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. వారికి ప్రతి నెల రూ.5వేల చొప్పున చెల్లించాలని, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ కూడా ప్రభుత్వమే చేయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు అది కొనసాగడం లేదని డ్రైవర్లు చెప్తున్నారని, దాన్ని కొనసాగించడమే కాకుండా రూ.10 లక్షలకు పెంచి డ్రైవరన్నల మనసుకు కాంగ్రెస్ సర్కార్ చూరగొనాలని సూచించారు. అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం మనందరం కలిసికట్టుగా పోరాడాలని, జెండాలన్నీ ఒక్కటి కావాలని, ఎజెండా ఒక్కటై ఉండాలని పిలుపునిచ్చారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, వీలైతే బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. మహాలక్ష్మి అని నెలకు రూ.2,500 ఇస్తానని, వృద్ధులకు నెలకు రూ.4 వేలు ఇస్తానని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఇంటింటికీ సంక్షేమం అంటూ ఊదరగొట్టారని విమర్శించారు. ప్రతి ఇంటికీ ఏడాదికి రూ.2.50 లక్షల విలువజేసే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని మాటిచ్చారని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ వచ్చి 11 నెలలైనా ఇంకా హామీలు ఎందుకు నెరవేరలేదు? తెలంగాణలో వచ్చిన మార్పు ఏందీ? మన జీవితాల్లో వచ్చిన వెలుగులు ఏవీ?' అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కొత్తగా 20 వేల ఆటోలకు పర్మిట్లు ఇస్తామని చెప్పారని అది అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టం వల్ల ఇబ్బంది అవుతున్నట్టు డ్రైవర్లు చెప్తున్నారని, దానిని మినహాయించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఎలాంటి నష్టం జరిగినా వారి తరపున కొట్లాడుతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాకు కూడా పోలీసులు ఇబ్బందులు పెట్టినట్టు చెప్తున్నారని తెలిపారు. పోలీసోళ్లే వాళ్ల కుటుంబ సభ్యులను కొడుతున్నారని, డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ఇది జరిగిందని గుర్తుచేశారు.

కష్టాలు తెలుసుకుంటూ.. ఆటోలో కేటీఆర్!

తెలుగు తల్లి ఫ్లై ఓవర్ నుంచి ధర్నాచౌక్ వరకు కేటీఆర్ ఆటోలోనే ప్రయాణించారు. డ్రైవర్ యూనిఫాం ధరించి డ్రైవర్లందరికీ తోడుగా నిలిచారు. డ్రైవర్ వెంకట్‌తో మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల కష్టాలపై అడిగి తెలుసుకున్నారు. తనది ఇబ్రహీంపట్నం అని ఇక్కడే ఆటో నడుపుకొంటున్నానని, గతంలో రోజుకు రెండు వేల దాకా గిరాకీ ఉండేదని వెంకట్ చెప్పాడు. ఇప్పుడు కనీసం 800 కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయాడు. ఖర్చులన్నీ పోనూ 300 కూడా మిగలడం లేదని తన గోడు వెళ్లబోసుకున్నాడు. తెలంగాణ ఏర్పడ్డాక సంక్షేమ ఫలాలు పొందామని, కాంగ్రెస్ వచ్చాక ఆటోడ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశాడు. డ్రైవర్ వెంకట్‌కు భరోసానిస్తూ కేటీఆర్ ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. ఆటో డ్రైవర్లంతా కేటీఆర్ వస్తున్నాడని తెలిసి ఆటోకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. 'జై తెలంగాణ' అంటూ పెద్దపెట్టున నినదించారు.

సీఎం బయట తిరుగొద్దని కాంగ్రెసోళ్లే అంటుండ్రు

సెక్యూరిటీ లేకుండా బయటకు వెళ్తే జనం ఎక్కడ తంతారోనని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నదని కేటీఆర్ ఎద్దేవాచేశారు. అందుకే పోలీసులు లేకుండా ఆయన ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేదన్నారు. 'నల్లగొండలో కాంగ్రెసోళ్లు మీటింగ్ పెట్టుకున్నరు. అందులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నాడంట. కాంగ్రెస్ మీటింగ్‌ల కాంగ్రెస్ వ్యక్తియే చెప్తున్నడు. అన్న మనం ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు. పింఛన్లు పెంచలేదు. జనంలోకిపోతే తంతరు. ముఖ్యమంత్రి జరభద్రం అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే చెప్పే పరిస్థితి ఉన్నది' అని దెప్పిపొడిచారు. ఏక్ పోలీస్ నినాదం తాము ఇవ్వలేదని, కాంగ్రెస్సే ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం సెక్యూరిటీ నుంచి బెటాలియం సిబ్బందిని తీసేశారని ఇప్పుడు పోలీసులను ముఖ్యమంత్రే నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ఆటో అన్నలు తలుచుకుంటే బాషా సినిమాలో రజనీకాంత్‌లా 50 వేల మందినైనా తెచ్చి ధర్నా చేయగలరని, వాళ్ల సత్తా తమకు తెలుసునని చెప్పారు. 'మార్పు మార్పు అనుకుంటూ చాలా మంది తమకు తామే తమ కొంపలు ముంచుకున్నరు' అని చెప్పారు. మహాధర్నాలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజ్, తక్కెళ్లపల్లి రవీందర్, నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాస్యం వినయ్ భాస్కర్, ఏఐటీయూసీ వెంకటేశం, బీఆర్‌టీయూ వేముల మారయ్య, సీఐటీయూ శ్రీకాంత్, టీయూసీఐ ప్రవీణ్, ఆటోయూనియన్ నాయకులు సలీం భాయ్, సత్తిరెడ్డి, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

> గిరాకీ లేక ఆటోడ్రైవర్ల బతుకులు రోడ్డునపడ్డయి. ఈఎంఐలు, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు కట్టలేక అరిగోస పడుతున్నరు. వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని మాట ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసింది. హామీని అమలు చేయడమే కాదు.. ప్రతినెలా ఆటోడ్రైవర్లకు రూ.5 వేల చొప్పున చెల్లించాలి. -కేటీఆర్

> ఎన్నికల ముందు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి.. ఆటోలో ఎక్కి డ్రైవర్ల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తనని తియ్యటి పుల్లటి మాటలు చెప్పిండు. ఆటోడ్రైవర్లకు అందమైన రంగుల కలను చూపెట్టిండు. ప్రతి ఆటోడ్రైవర్‌కు నెలకు వెయ్యి రూపాయలు ప్రత్యేకంగా ఇస్తమని నమ్మించిండు. ఇప్పుడు రాహుల్ గాంధీ ఎక్కడున్నడు? - కేటీఆర్

కుటుంబం గడుస్తలేదు

ఫ్రీ బస్సుతో మా పరిస్థితి ఘోరంగా తయారైంది. గిరాకీ లేక ఆటోడ్రైవర్లమంతా రోడ్డునపడ్డం. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నం. కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నం. ఆటో ఫైనాన్స్‌లు కట్టలేక అరిగోస పడుతున్నం. ప్రభుత్వం మాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు.

-జే అశోక్, ఆటో డ్రైవర్, సంగారెడ్డి జిల్లా

చాలామంది ఆత్మహత్య చేసుకున్నరు

ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నరు. మాకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని అడిగినప్పుడల్లా దాటవేస్తున్నది. గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు కాలేదు. ఆటోడ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

-ఎం కృష్ణయ్య, ఆటో డ్రైవర్

రేవంత్‌రెడ్డి ఒక్క హామీ నెరవేర్చలే

అనేక మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి గత 11 నెలల నుంచి ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలని చెప్పి అందర్నీ ఆగం చేసింది. మా బతుకులను రోడ్డు పాలుచేసింది. మాకు నెలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి 11 నెలలవుతున్నా ఇస్తలేరు.

-రామ్ కిషన్, ఆటోడ్రైవర్

లోకం పోకడ

'నమస్తే తెలంగాణ'పై కేసులు అప్రజాస్వామికం

మీడియా స్వేచ్ఛను హరించడమే ప్రజాపాలనా?

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించి నాలుగుకోట్ల ప్రజల గొంతుక అయిన 'నమస్తే తెలంగాణ'పై కేసులు అప్రజాస్వామికమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర ఖండించారు. నాదర్‌గుల్‌లో బిగ్ బ్రదర్స్ ల్యాండ్ పూలింగ్‌పై ఆధారాలతో ప్రచురించిన పత్రిక గొంతునొక్కడం దుర్మార్గమని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛను హరించడం, ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాల హక్కులను కాలరాయడమే ప్రజాపాలనా? అని నిలదీశారు. ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు ఆరోపించారు. ఎంత తొక్కితే అంతకు రెట్టింపు ఉత్సాహంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.

బట్టలు ఉతకాలని తీసుకెళ్లి గ్యాంగ్ రేప్!

గొంతు నులిమి చంపేందుకు యత్నం

మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అఘాయిత్యం

పోలీసుల అదుపులో నిందితుడు.. ఇద్దరు పరార్

నిందితులంతా ఉత్తరప్రదేశ్‌కు చెందిన పెయింటర్లు

వెంగళరావునగర్, నవంబర్ 5: ఇంటి వద్ద బట్టలు ఉతకాలని చెప్పి ఒక మహిళను కూలికి తీసుకెళ్లిన ముగ్గురు కామాంధులు ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి, బెల్ట్‌తో కొట్టి ఈ దారుణానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన మహిళ (50) భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్నది. సోమవారం కూలి పనులు ముగించుకొని సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి బయలుదేరింది. హైటెక్‌సిటీ బస్‌స్టాప్ జంక్షన్ వద్ద బస్ కోసం వేచి చూస్తుండగా.. అంతలోనే ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓంనగర్‌లో ఉన్న తమ ఇంట్లో బట్టలు ఉతకాలని, రూ.500 ఇస్తామని చెప్పి తీసుకెళ్లారు. బట్టలు ఇంట్లో ఉన్నాయని చెప్పిన నిందితులు లోనికి తీసుకెళ్లి గట్టిగా పట్టుకున్నారు. లైంగికదాడికి యత్నిస్తుండగా వారి నుంచి తప్పించుకునేందుకు ఆమె ప్రయత్నించింది. ఆమెను బెల్టుతో తీవ్రంగా కొట్టారు. నోటిలో గుడ్డలు కుక్కి, దుస్తులు చింపేశారు. మద్యం తాగుతూ లైంగికదాడికి పాల్పడ్డారు. చివరికి బాధిత మహిళ బిగ్గరగా కేకలు వేయడంతో పొరుగింటిలో ఉండే ఒక మహిళ తలుపు తట్టి లోపలికి వచ్చి కాపాడేందుకు యత్నిస్తుండగా.. ఆ కమాంధులు బాధితురాలి గొంతు నులిమి చంపేందుకు యత్నించారు. అతికష్టంతో వారి బారి నుంచి విడిపించుకుని నగ్నంగా బాధిత మహిళ బయటకు రాగా.. పక్కింటి మహిళ నైటీ ఇచ్చింది. అక్కడి నుంచి కామాంధులు పారిపోయారు. బాధిత మహిళ రాత్రి 11.30 గంటలకు మధురానగర్ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

లైంగిక దాడికి పాల్పడ్డ ముగ్గురు నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన చందు చౌహాన్(25), ఎండీ రఫీక్‌ఖాన్, చోటుగా పోలీసులు గుర్తించారు. వీరు పెయింటింగ్ పనులు చేస్తారని, నెల క్రితమే వచ్చి ఇక్కడ అద్దెకు ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు చందు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. మంగళవారం ఉదయం వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

తెలంగాణ రియల్టర్స్ ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ టీఆర్ఎఫ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రేవంత్ ఫెయిల్.. రియల్ ధమాల్

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ పొట్ట కూటి కోసం వచ్చిన వాళ్లతో మాకు పంచాయితీలేదని, మా పొట్ట కొట్టే వాళ్లతోనే మా పంచాయితీ అని స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. మాది స్టేట్ ఫైటే... స్ట్రీట్ ఫైట్ కాదని తెలిపారు. అభివృద్ధే మా కులం, సంక్షేమమే మా మతం, తెలంగాణే మా ప్రధాన ఎజెండాగా పెట్టుకొని ఎన్నికలకు పోయామని.. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వాళ్లు భూమి మీద పెట్టుబడి పెట్టారని చెప్పారు. తెలంగాణలో ఎంతమంది భూస్వాములు ఉన్నా సాగునీళ్లు లేక ఆ భూములకు విలువరాలేదని చెప్పారు. నాటి పాలకులు ఇక్కడి చెరువులను, చిన్న నీటి వనరులను కాపాడాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు.

> హైడ్రా పేరుతో అనాలోచితంగా ఇండ్లను కూల్చివేయడంతో ఓ మహిళ 20 ఏండ్ల పాటు ఈఎంఐ ఎలా కట్టాలని ప్రశ్నించింది. మరి దానికి హైడ్రానా? మున్సిపల్ శాఖనా? ముఖ్యమంత్రా? ఎవరు సమాధానం చెబుతారు. - కేటీఆర్

కాంగ్రెస్ మార్పు మంచిగున్నదా ?

మార్పు కోసం.. అని ఎన్నికల ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ 11నెలల పాలనలో మార్పు మంచిగున్నదా ? అని కేటీఆర్ ప్రశ్నించారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే తెలుస్తాయన్నట్టు.. కేసీఆర్ ప్రభుత్వం విలువ కూడా ఇప్పుటికే తెలుస్తున్నదని చెప్పారు. తెలంగాణ వచ్చిన రోజు కరెంటు కోతలు, పరిశ్రమలకు పవర్ హాలీడేలు, రైతులకు అర్ధరాత్రి కరెంటులు ఉండేవని.. ఇట్లాంటి పరిస్థితుల్లో ప్రారంభమైన కేసీఆర్ ప్రయాణం ఒక్కొక్కటీ బాగు చేసి రాష్ట్రాన్ని పటిష్టంగా, పెట్టుబడులకు బ్రహ్మాండంగా తీర్చిదిద్దారని చెప్పారు.

> కేసీఆర్ పాలనలో సాగునీళ్లు వచ్చాక రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా ఎకరానికి రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు ధర పలుకుతున్నది. భూమి విలువ పెరిగితే భూయజమానికి భరోసా ఉంటుంది. అందుకు కారణం ముమ్మాటికీ కేసీఆరే. - కేటీఆర్

రియల్ ఎస్టేట్‌లో భూముల ధరలు ఛూమంతర్ అనగానే పెరగలేదని.. రాష్ట్రంలో సమగ్ర, సమీకృత, సమ్మిళిత అభివృద్ధిని కేసీఆర్ చేసి చూపించడం వల్లే సాధ్యమైందని తెలిపారు. నేడు ఏ రైతును కదిలించినా బాధపడుతున్నారని.. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని చెబుతున్నారని పేర్కొన్నారు. నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులే కాంగ్రెస్ చేసిన మోసాలను చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన ఇలాగే కొనసాగితే సంక్షోభం తప్పదని, ప్రజల చేతుల్లో డబ్బులు లేకుండా ప్రభుత్వం చేస్తుండడమే ఈ పరిస్థితికి కారణమని చెప్పారు. ఆలోచన లేకుండానే హైడ్రాను ఏర్పాటు చేసి బ్లాక్ మెయిల్ దందా చేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ సంస్థలు నిర్మించే ప్రాజెక్టులకు లేక్ వ్యూ అని పేరు పెట్టాలంటే భయపడేపరిస్థితులు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో నో ఎల్ఆర్ఎస్, నో బీఆర్ఎస్ అని చెప్పి.. ఇప్పుడు ముక్కుపిండి మరీ ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేటీఆర్ సూచించారు. లక్షలాది మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్ల కోసం అసెంబ్లీలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చెప్పారు. తెలంగాణ రియల్టర్స్ ఫోరం మరింత బలపడాలని కేటీఆర్ సూచించారు. టీఆర్ఎఫ్ డిమాండు చేస్తున్న 5 పాయింట్ల ఎజెండా చాలా సముచితమైందని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ రియల్టర్స్ ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డితో పాటు వందలాది మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లు పాల్గొన్నారు.

> రియల్ ఎస్టేట్ గురించి తన కన్నా ఎక్కువ ఎవరికీ తెలుసు అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో రియల్ రంగం అగమ్యగోచరంగా తయారైంది. గుంపు మేస్త్రీ మాదిరిగా పనిచేస్తానన్న రేవంత్‌రెడ్డి 11 నెలల్లో రియల్ రంగానికి ఒక్క మంచి నిర్ణయం తీసుకోలేదు. -కేటీఆర్

రాష్ట్రానికి రియల్ శాపం కాంగ్రెస్

- 3 నెలలుగా రిజిస్ట్రేషన్ల నేల చూపులు
- నిరుడు అక్టోబర్‌తో పోల్చితే రూ.424 కోట్లు తగ్గిన రాబడి
- ఆదాయం పెంచాలని ప్రభుత్వం ఒత్తిడి
- గందరగోళంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల బెంబేలు



హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి 'రియల్' శాపం కొనసాగుతున్నది. హైడ్రా ప్రకంపనలు, మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం వణుకుతున్నది. మూడు నెలలుగా తిరోగమనంలో ప్రయాణిస్తున్నది. నిరుడు అక్టోబర్‌తో పోల్చితే ఆగస్టు నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రాబడి తగ్గుతుండగా అక్టోబర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దాదాపు రూ.400 కోట్లు తగ్గినట్టు ఆ శాఖ వర్గాలు చెప్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంపై హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రాజెక్టు ప్రతిపాదనలు పిడుగులా పడగా రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు తెచ్చేలా ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టకపోవడంతో మార్కెట్‌కు ఉత్సాహం రావడం లేదని రియల్టర్లు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ విధానాలు, ఫోర్త్ సిటీ వంటి బూమరాంగ్ నిర్ణయాలు శాపంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో ఇండ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల క్రయవిక్రయాలు తగ్గిపోగా, ధరల పెరుగుదల స్తంభించిపోయింది.

ఖజానాకు 35 శాతం తగ్గిన రాబడి

నిరుడు అక్టోబర్‌లో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఖజానాకు రూ.1219 కోట్ల ఆదాయం వచ్చింది. దాదాపు లక్షన్నర లావాదేవీలు నమోదయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 1.23 లక్షల లావాదేవీలు నమోదైనట్టు రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు తెలిపాయి. రూ.795 కోట్ల ఆదాయం వచ్చినట్టు వెల్లడించాయి. సెప్టెంబర్‌తో పోల్చితే దాదాపు రూ.20 కోట్లు అదనంగా వచ్చినా.. గతేడాదితో పోల్చితే మాత్రం రూ.424 కోట్ల లోటు నమోదైంది. అంటే ఖజానాకు ఆదాయం 34 శాతం పడిపోగా, లావాదేవీల సంఖ్య 18 శాతం తగ్గింది. రాష్ట్రంలో జూలై నుంచి హైడ్రా హడావుడి మొదలైంది. అప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి ఇలాగే ఉన్నది. మూసీ ప్రాజెక్టు కూడా తోడవడంతో క్రయవిక్రయాలు తగ్గి నేల చూపులు చూస్తున్నది. ప్రతి నెలా లావాదేవీల సంఖ్యలో 20 శాతం, ఆదాయంలో 30 శాతం మేర తగ్గుదల కనిపిస్తున్నది. ఈ ఏడాది జూలైతో పోల్చితే ఆగస్టులో రిజిస్ట్రేషన్లు 27.39 శాతం తగ్గగా, ఆదాయం ఏకంగా 30 శాతం పడిపోయింది. ఇక ఆగస్టుతో పోల్చితే సెప్టెంబర్‌కు పరిస్థితి మరింత దిగజారింది. రిజిస్ట్రేషన్లు 13 శాతం తగ్గగా ఖజానాకు రాబడి 28 శాతం తగ్గింది.

అసంబద్ధ విధానాలు.. అధికారులపై ఒత్తిళ్లు

ఖజానాకు రాబడి తగ్గుతుండటంతో ప్రభుత్వంలో అలజడి మొదలైంది. రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తరుచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆదాయ వనరుల సమీకరణకు ఏకంగా సబ్ కమిటీని నియమించారు. అధికారులు ఎలాగైనా ఆదాయం పెంచాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తుండటంతో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్ల సంఖ్య ఎలా పెంచగలమని వాపోతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ విధానాలతో మార్కెట్ డల్‌గా తయారైందని, ఇప్పుడు ప్రభుత్వమే ఆదాయం పెంచాలంటే ఎలా అని నిట్టూరుస్తున్నారు. మరోవైపు ప్రస్తుత పరిస్థితులతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. నెలలోనే పరిస్థితి దారుణంగా తయారైందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జూలైలో రూ.1531 కోట్ల ఆదాయం రాగా అక్టోబర్ నాటికి సగం పడిపోయింది. జూలైలో 2.04 లక్షల లావాదేవీలు నమోదుకాగా అక్టోబర్ నాటికి 40 శాతం తగ్గి 1.23 లక్షలకు పడిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరువాలని, రియల్ ఎస్టేట్ రంగానికి ఊరట కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.

'దశ' వసంతంలోకి టీహబ్

- అద్భుత వేదికకు తొమ్మిదో వార్షికోత్సవం
- ఆవిష్కరణల తోవలో అనేక అనుభూతులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



టీహబ్‌ను ప్రారంభిస్తున్న రతన్‌టాటా. చిత్రంలో నాటి గవర్నర్ నర్సింహన్, కేటీఆర్(ఫైల్)

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఐటీ, ఆవిష్కరణలు దేశానికే ఆదర్శనీయం. దేశంలో మరే రాష్ట్రం ఐటీలో నూతన ఆవిష్కరణల ఆలోచన చేయనినాడే తెలంగాణ దిక్సూచి అయిందని, అందుకు ఎంతో సంతోషంగా ఉందని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టీహబ్ ప్రారంభమై మంగళవారం నాటికి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "తొమ్మిదేండ్ల క్రితం భారతదేశంలో అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్‌ను రతన్ టాటా ప్రారంభించారు. టీహబ్ న్యూఫేజ్ ఆఫ్ ఇండియాగా రూపాంతరం చెందింది. దేశంలో నూతన ఆవిష్కరణలకు, భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు టీహబ్ వేదిక కావాలి అన్న దార్శనికతతో కేసీఆర్ ఆలోచనా విధానాలకు అంకురార్పణ జరిగిన అద్వితీయమైన రోజు రాష్ట్ర ఐటీ చరిత్రలో ఆనందకరమైనది" అని ఎక్స్ వేదికగా తన అనుభూతులను పంచుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన అపురూప విజయాలు తెలంగాణ రాష్ట్రాన్ని స్టార్టప్ స్టేట్ ఆఫ్ ఇండియా మలిచాయని తెలిపారు. టీహబ్‌తో పాటు వీహబ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) టీవర్క్స్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(రిచ్) ఇలా అనేక సంస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ వేసిన పునాదులపై ప్రస్తుత నాయకత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ప్రశ్నిస్తే ఫామ్‌హౌస్‌కు నోటీసులా?

అసాంఘిక కార్యక్రమాలంటూ ఇబ్బందులా?

పోలీసులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యమా?

సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ ఫైర్



యాదాద్రి భువనగిరి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వ్యవసాయ క్షేత్రానికి నోటీసులు పంపిస్తారా? అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యవసాయం చేస్తుంటే అసాంఘిక కార్యక్రమాలు అంటూ నోటీసులు ఇస్తారా? అని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆత్మకూర్‌లోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటుంటే పోలీసుల ద్వారా నోటీస్ ఇప్పించారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు రేవంత్‌రెడ్డికి అలవాటేనని, అందరూ ఆయనలాగే ఉంటారని అనుకోవడం పొరపాటన్నారు. ఇటీవల కేటీఆర్ బావమరిది గృహప్రవేశం పార్టీ చేస్తే రేవంత్‌రెడ్డి విషం చిమ్మారని గుర్తు చేశారు. పాలన చేతకాక పోలీసులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యం చేస్తున్నారని విమర్శించారు.